రాగం :

తాళం :

రచన : కలగ కృష్ణమోహన్

సంగీతం :

గానం :

# 8. తెలుగు తోటలో విరిసిన

తెలుగు తోటలో విరిసిన ఎడద నాది - ఆ

వెలుగు పాదులో మొలిచిన నడక నాది

పాలబువ్వతో గోరుముద్దలతో

తెలుగు నేర్చిన స్వరము నాది

తీయదనాల పరిమళాల

తెలుగుదనాల పదము నాది

తెలుగు తేటలో ఊరిన పలుకు నాది - ఆ

వెలుగు పాదులో మొలిచిన నడక నాది

దూరకాలాల సుప్రభాతాల

సుధలు చిలికిన వీణ నా తెలుగు

కాలతీరాల వేలదూరాల

ఎదలు కలిపిన భాష నా తెలుగు

తెలుగు పద్యమై ఎగసిన ఉనికి నాది - ఆ

వెలుగు పాదులో మొలిచిన నడక నాది

దేశదేశాల సారస్వతముల

ఆదరించిన దేశము నాది

దేశ భాషల తెలుగు లెస్సయని

తేజరిల్లిన అహము నాది

తెలుగు పథమై సాగిన పదము నాది - ఆ

వెలుగు పాదులో మొలిచిన నడక నాది